క్లుప్తంగా

గ్యారంపల్లె పీహెచ్‌సీకి రూ. 35 వేలు వితరణ



పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌తో వైద్యాధికారులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి టి. చంద్రావారిపల్లెకు చెందిన జి. లోకనాథరెడ్డి రూ. 35 వేలు వితరణ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ దాత అందజేసిన నగదులో రూ. 11 వేలు వెచ్చించి వాటర్ కూలర్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. మిగిలింది ఆస్పత్రి అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. డాక్టర్ పావనిగౌరి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

తంబళ్లపల్లె : రాష్ట్రంలో బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్‌లు తెలిపారు. బుధవారం విజయవాడలోని బార్జూర్‌గ్రాండ్ హాల్‌లో జరిగిన బీసీల సమావేశానికి అధిష్టానం పిలుపు మేరకు హాజరైనట్లు తెలిపారు.

గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేయాలి



గ్రామ సచివాలయ సిబ్బందితో తహసీల్దార్ నరసింహులు

కేవీపల్లె : గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేయాలని తహసీల్దార్ నరసింహులు అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చే ప్రజల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు సకాలంలో అందించాలన్నారు. బీఎల్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు.

ఆడబిడ్డ రక్షణకు చేయూతనిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : అడబిడ్డ రక్షణకు చేయూతనిద్దామని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆడపిల్లల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సాధనాల ద్వారా లింగనిర్ధారణ చేయడం, ఆడ శిశువు అని తెలిస్తే అబార్షన్ చేయించడం చట్టవిరుద్ధమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సీహెచ్‌ఓలు ఆయేషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుంటిగంగమ్మ జాతర



విశేష అలంకరణలో గుంటిగంగమ్మ అమ్మవారు

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీ గుంటిగంగమ్మ జాతర ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. అమ్మవారికి అర్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, 16వ తేదీ రాత్రి చాందినీబండ్లు, అన్నదానం బండ్లు, పానకం బండ్లు ఊరేగించనున్నారు. 17న పగలు తిరునాల, దీలు, బోణాలు సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా పోతక్క,పోలేరమ్మ గంగజాతర

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పోతబోలులో వెలసిన పోతక్క, పోలేరమ్మ గంగజాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. జాతర పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు దీపాలతో అలంకరించారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో పోతక్క, పోలేరమ్మ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణంలో పది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమైంది. మొదటి సంవత్సరం సంస్కృతం, ఉర్దూ, హిందీ, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. చాలా మంది విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు అధికంగా కన్పించారు. పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం 462 మందికి గాను 414 మంది హాజరయ్యారు. 68 మంది గైర్హాజరైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు.



పీలేరురూరల్ : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

ఐదుగురు విద్యార్థులు గైర్హాజరు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు మొత్తం ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో మొత్తం 168 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఇద్దరు విద్యార్థులు 9.07 గంటలకు పరీక్షా కేంద్రానికి రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. మిగిలిన ఐదుగురు గైర్హాజరయ్యారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, శ్రీ చైతన్య కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. 1228 మంది హాజరు కావాల్సి ఉండగా 1173 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, కస్టోడియన్ అధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. 55 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో 176 మంది విద్యార్థులకు గాను 167 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 217 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 198 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఉమా అమరేశ్వరి తెలిపారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ ఎగ్జామినర్ రామాంజనేయ ప్రసాద్, డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఐదుగురు ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షించారు. 126 మంది విద్యార్థులకు 124 మంది హాజరయ్యారు. ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ నిరంజన్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు : ములకలచెరువు మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఓ క్రిష్ణప్ప, చీఫ్‌ఎగ్జామినర్ కవిత తెలిపారు. 248 మంది విద్యార్థులకు గాను 238 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. 10 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.



గుర్రంకొండ : పరీక్షా కేంద్రంలోకి పరుగులు..



మదనపల్లె : గదుల నంబర్లు చూసుకుంటూ..



వాల్మీకిపురం : పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



తంబళ్లపల్లె : పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మదనపల్లె మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. పోతబోలు పంచాయతీ వలస మూల గ్రామానికి చెందిన దంపతులు కుమార్ (36), రమాదేవి(30) మదనపల్లె పట్టణం నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామైన వలసమూలకు బయలుదేరారు. అదే విధంగా పెద్ద చెన్నయ్యగారిపల్లె నుంచి సీటీఎంకు రమేష్(29)బైక్‌లో వెళుతున్నాడు. గుండాలపల్లె క్రాస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వాహనాల్లో ఉన్న ముగ్గురు గాయపడ్డారు.

ఆటో ఢీ కొని..

నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ (55) వ్యక్తిగత పనులపై తన ద్విచక్రవాహనంలో పట్టణంలోకి బయలుదేరాడు. మార్గమధ్యలో కదిరిరోడ్డులో వెనుకనుంచి వేగంగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు.

రాజకీయ శాస్త్రవేత్త కాన్షీరామ్

మదనపల్లె సిటీ : మెజారిటీ ప్రజలైన బహుజనులు రాజకీయ అధికారం చేపట్టే మార్గాన్ని కనుకొన్న రాజకీయ శాస్త్రవేత్త కాన్షీరామ్ అని భారతీయ అంబేద్కర్ (బాస్) వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక బాస్ కార్యాలయంలో కాన్షీరామ్ 89వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాధికార దిశగా బహుజన నాయకత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు బాస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8న రాజ్యాంగరక్షణ భేరి పేరుతో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, నాయకులు రమణ, శ్రీనివాసులు, హైదర్, రవిశంకర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరామ్‌కు నివాళులు అర్పిస్తున్న బాస్ నాయకులు

పేదలకు అన్నదానం

కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో అన్నదానం చేశారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశ్యామ్, సుందర్‌శివ, అరుణ్, అనిల్‌పునీత్, గంగాధర్, శీను తదితరులు పాల్గొన్నారు.

బజారు వీధికి దారేదీ?

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని బస్టాండుకు పక్కనే ఉన్న జజారు వీధికి వెళ్లే దారులు మూసుకుపోతుండడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు నుంచి సర్కారుబావి సందు మీదుగా బజారువీధికి వెళ్లే మార్గం మొత్తం కబ్జాకు గురైంది. ఎన్‌హెచ్ 340 మెయిన్ రోడ్డు నుంచి బజారువీధికి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం ఆక్రమించేశారు. ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా ఉంచేస్తున్నారు. ఇదే మార్గంలో వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు వెళుతుంటారు. వేలాది మంది ప్రజలు ఇదే మార్గం నుంచి పట్టణానికి దిగువన ఉన్న దర్గావీధి, బలిజగడ్డ, ఎల్లుట్ల గడ్డ, తాళింవీధి, ఖాజీవాడ, తహసీల్దార్ కార్యాలయానికి వెళుతుంటారు. అయితే కొంతమంది దారి మొత్తాన్ని ఆక్రమించుకొని వాహనాలు, దుకాణాలు ఇష్టానుసారం ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బజారువీధికి వెళ్లే మార్గంలో అడ్డంగా ఉంచిన ద్విచక్రవాహనాలతో మూసుకుపోయిన దారి

మహిళల సమస్యలపై స్పందించండి



మహిళల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శోభ

నిమ్మనపల్లె: మహిళల సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మహిళా సమస్యలకు సంబంధించి వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ సి.ఆర్.మంజులకు అందజేశారు. పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు చెల్లించాలని, మహిళలపై బెదిరింపులు, వేధింపులు, లైంగిక దాడులను అరికట్టేందుకు మరింత కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. 55 సంవత్సరాలు పూర్తయిన మహిళలందరికి పింఛన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగరత్న, సరస్వతి, శేఖర, గుర్రప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోండి



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఎనుగొండపాళ్యెం పంచాయతీ ఎగువపాళ్యెం, దిగువపాళ్యెం గ్రామాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, ఆరోగ్యకార్యకర్తలు శివప్రసాద్, లక్ష్మి, అశ్విని, రమేష్, హైమావతి, నరసమ్మ, సుశీలభాయ్ తదితరులు పాల్గొన్నారు.

పీటీఎంలో ముగిసిన గంగ జాతర

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పీటీఎం, రంగసముద్రం, అంకిరెడ్డిపల్లి, మడుమూరు, మద్దయ్యగారిపల్లి తదితర గ్రామాల్లో గత రెండు రోజులుగా గంగ జాతరలు జరిగాయి. గంగ జాతరలో భాగంగా భక్తులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు చలిపిండి దీపాలతో జ్యోతులు మోశారు. స్థానిక సంత బజార్‌లో ప్రతిష్ఠించిన గంగ, గౌరీ ప్రతిమల ఎదుట భక్తులు పూజలు నిర్వహించారు. మండల వాసులే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జాతరను తిలకించారు. గంగజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ములకలచెరువు సీఐ సాదిక్ అలీషా పర్యవేక్షణలో పోలీసుల అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహించారు.



పెద్దతిప్పసముద్రంలో పూజలందుకున్న గంగ, గౌరీ ప్రతిమలు

వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం

మదనపల్లె : మండలంలోని సీటీఎం పంచాయతీలో వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తంజావూరు రఫీ కుటుంబానికి గ్రామ, వార్డు వలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి ఉదయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుడు నీరుగట్టిరాజేష్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జమాల్‌వలీ బుధవారం రఫీ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20,000 బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మదనపల్లె మండల అధ్యక్షుడు వెంకటపతి, సంఘం సభ్యులు భాను, రమేష్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్ రఫీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్ అసోసియేషన్ సభ్యులు

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



కొత్త బోరుకు పూజలు చేస్తున్న సర్పంచ్ గంగులమ్మ

వాల్మీకిపురం : వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని హసన్‌ఖాన్‌వీధిలో పంచాయతీ నిధులతో కొత్త బోరును తవ్వించేందుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హసన్‌ఖాన్‌వీధిలో నెలకొన్న తాగునీటి సరఫరాలో ఆలస్యమవుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ నిధుల ద్వారా కొత్త బోరును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, రవి, రాయుడు, వెంకటేష్, కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగభద్రత కల్పించాలి



వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఓఏలు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్యల్లో వీఓఏ(యానిమేటర్స్)గా పనిచేస్తున్న ఉద్యోగులకు కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వీఓఏల సంఘ ఉపాధ్యక్షుడు జి.రెడ్డెప్పరెడ్డి, మండల అధ్యక్షురాలు శ్వేతాకుమారి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం న్యాయబద్ధమైన తమ డిమాండ్లను ఆమోదించి మరింత మెరుగైన సేవలందించే దిశగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల కార్యదర్శి దివ్యజ్యోతి, కోశాధికారి సుమతి, సభ్యులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

వాల్మీకిపురం : పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద చింతల అభిమాన సంఘం సభ్యులు సతీష్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రవీంద్రల ఆధ్వర్యంలో నిరుపేదలు, వృద్ధులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.

సహకార బ్యాంకు సేవలపై కళాజాత

మదనపల్లె : ది చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో బుధవారం పట్టణంలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచిలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న వివిధ పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలు, డిపాజిట్లు, వాటిపై లభించే అధిక వడ్డీ, సహకారబంధు పథకం, సైబర్ మోసాలు, డిజిటల్ లావాదేవీలపై ఎం.వి.రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ చంద్రకళ, ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ అక్రమ్, కళాజాత బృందం సభ్యులు మహేష్, రాజేష్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సహకార కేంద్రబ్యాంక్ సేవలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు కలిచెర్ల విద్యార్థిని ఎంపిక

పెద్దమండ్యం : రాష్ట్రస్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కలిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని మెహతాజ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గతనెలలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 780 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పాఠశాల విద్యార్థిని ×ఫార్మర్ ఫ్రెండ్లీ గైడర్ అనే ప్రయోగం చేసినట్లు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, గైడ్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌కుమార్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

16 నుంచి ఉరుసు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న దర్గా

వాల్మీకిపురం : స్థానిక సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సందాని తెలిపారు. ఈ నెల 16వ తేదీ గురువారం గంధం, ముషాయిరా కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17వ తేదీ శుక్రవారం ఉరుసు, ఖవాలి, 18వ తేదీ తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప పెద్దదర్గా పీఠాధిపతి హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుసేని పాల్గొంటారన్నారు.

స్కీం కార్మికుల సమస్యలపై రేపు చలో విజయవాడ

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా స్కీం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయకార్యదర్శి వత్రి సురేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న అంగన్‌వాడీ, ఆశా, మిడ్‌డేమీల్స్, స్కూల్ స్వీపర్స్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలుచేయాలని విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, శివ, సురేందర్‌నాయక్, ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్యశిబిరం

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సదాశివరెడ్డి తెలిపారు. మూడో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి వైద్య శిబిరం శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని కోరారు.

తొలిదశలో గుర్తిస్తే క్షయ నివారణ సులభం



టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న దాతలు

వాల్మీకిపురం : క్షయవ్యాధిని తొలిదశలోనే గుర్తించి సమీప ప్రభుత్వ వైద్యులను సంప్రదిస్తే వ్యాధి నివారణ మార్గం సులభతరం అవుతుందని పౌష్టికాహార దాతలు ఆనంద రెడ్డి, మోహన్‌రాం అన్నారు. బుధవారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో క్షయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్లు నాగిరెడ్డి, మురళి ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మాత్రలు పంపిణీ చేశారు.

పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల ఆర్‌బీకేలో పెస్టిసైడ్ ఇండియా ఇండస్ట్రీస్ లిమిటెడ్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమలత ఆధ్వర్యంలో పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రతలపై ఏఓతో పాటు కంపెనీ ప్రతినిధి ధర్మతేజ రైతులకు సూచనలిచ్చారు.

ఓటరుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

పీలేరు : ఓటరుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 59 వేల ఓట్లు ఉన్నాయని, అందులో 72 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయిందన్నారు. మిగిలింది పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ కిరణ్, ఏఎస్‌ఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

టీబీ రోగిని దత్తత తీసుకున్న తహసీల్దార్



రోగి దత్తతకు నగదు అందజేస్తున్న తహసీల్దార్

కురబలకోట : టీబీతో బాధపడుతున్న రోగిని కురబలకోట తహసీల్దార్ ఎం. భీమేశ్వరరావు బుధవారం దత్తత తీసుకున్నారు. నిక్షయ్ పోషణ యోజన కింద రూ.3 వేలు బాధితుడికి అందజేశారు. ఆర్‌ఐ సుగుణ కూడా మరో టీబీ వ్యాధి గ్రస్తుడిని దత్తత తీసుకున్నారు. దీని ద్వారా నిర్ధారిత బాధితులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందజేస్తామని మండల వైద్యాధికారి కె. శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఉంటే టీబీని త్వరిత గతిన నిర్మూలించవచ్చన్నారు. ఎంపీడీఓ దిలీప్ కుమార్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.